


# మెదక్‌గడ్డ.. బీఆర్‌ఎస్ అడ్డ

పట్టు నిలుపుకొన్న బీఆర్‌ఎస్

## ఉమ్మడి మెదక్ జిల్లాలో పది స్థానాలకు ఏడు చోట్ల ఘన విజయం

- మూడుస్థానాలకే పరిమితమైన కాంగ్రెస్
- 2014లో 9, 2018లో 9 స్థానాలు కైవసం
- 2023లో ఏడు స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయకేతనం
- ఎన్నికలు ఏవైనా బీఆర్‌ఎస్ వెంటే అంటున్న జనం


కేసీఆర్
గజ్వేల్


హరీశ్ రావు
సిద్దిపేట


సునీతా లక్ష్మారెడ్డి
నర్సాపూర్

సిద్దిపేట, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉద్యమాల పురిటి గడ్డ..బీఆర్‌ఎస్ కంచుకోట ఉమ్మడి మెదక్ జిల్లా .. ఆదివారం శాసనసభ సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో మరోసారి బీఆర్‌ఎస్ తన సత్తా చాటుకుంది. పది శాసనసభ స్థానాలకు ఏడు చోట్ల ఘన విజయం సాధించింది. ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ కంచుకోట అని రుజువు చేశారు. రాష్ట్రం అంతా కాంగ్రెస్ గాలి వీచినా ఇక్కడ మాత్రం ఆ హవా పనిచేయలేదు. ఎన్నికలు ఏవైనా అది బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వెంటే అని ఇక్కడి ప్రజలు నిరూపించారు. బీఆర్‌ఎస్ ఆవిర్భవించిన నాటి నుంచి పార్టీకి వెన్నంటే ఇక్కడి ప్రజలు ఉంటున్నారు. అవి శాసనసభ ఎన్నికలు కావచ్చు, పార్లమెంట్ ఎన్నికలైనా, స్థానిక సంస్థల ఎన్నికలైనా అన్నింటిలోనూ బీఆర్‌ఎస్ పార్టీకే ప్రజలు పట్టం కడుతున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావడంతో ఈ జిల్లాకు ప్రాధాన్యత సంతరించుకుంది. అందుకు తగ్గట్టుగానే ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారు. బీఆర్‌ఎస్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అనేక విజయాలను అందించింది మెతుకు గడ్డ. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2014, 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ ఆధిక్యతను కనబర్చింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 10 శాసనసభ స్థానాలకు 2014లో 8 స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకోగా, జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యే అనారోగ్య కారణంతో మరణించగా అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. 2016లో జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి గెలుపొందారు. దీంతో 10కి తొమ్మిది చోట్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక 2018 ఎన్నికల ఫలితాల్లో 10 శాసనసభ స్థానాలకు తొమ్మిది చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఒక్క సంగారెడ్డిలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ గెలిచింది. అది కూడా ట్రక్కు గుర్తు ప్రభావంతో కాంగ్రెస్ గెలుపొందింది. తదనంతరం దుబ్బాక ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అనారోగ్య సమస్యల కారణంగా మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. 2020లో ఉప ఎన్నిక జరిగింది. ఈ ఉప ఎన్నికల్లో స్వల్ప ఓట్ల మెజార్టీతో బీఆర్‌ఎస్ ఓడిపోయింది. కాగా ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు 1,079 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అంతకుముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మూడు జిల్లా పరిషత్‌లను బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. అన్ని మండల పరిషత్‌లతో పాటు, గ్రామాల సర్పంచ్‌లు ఇలా అన్నింటా బీఆర్‌ఎస్ నిలిచింది. జిల్లాలో 95 శాతానికి పైగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఇటీవల జరిగిన 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఏడు స్థానాలు గెలుపొందగా కాంగ్రెస్ మూడు చోట్ల విజయం సాధించింది.

### పదిలో ఏడు చోట్ల బీఆర్‌ఎస్ ఘనవిజయం

జిల్లాలోని పది శాసనసభ స్థానాలకు ఏడు చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ మూడు చోట్ల విజయం సాధించింది. 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ విజయాన్ని సొంతం చేసుకుంది. 2014లో రెండు, 2018లో ఒక స్థానం, 2023లో మూడు స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది.ఎన్నికల ఫలితాలను చూస్తే ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోట అని చెప్పవచ్చు. 2023 శాసనసభ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే గజ్వేల్ నుంచి కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కు 1,11,684 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్‌కు 66,653 ఓట్లు వచ్చాయి. కేసీఆర్ 45,031 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సిద్దిపేట నుంచి ఏడో సారి పోటీ చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి తన్నీరు హరీశ్‌రావుకు 1,05,514 ఓట్లు , తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణకు 23,206 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో హరీశ్‌రావు 82,308 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. పైగా వరుసగా ఏడోసారి ఒకే నియోజకవర్గం నుంచి గెలుపొంది అరుదైన రికార్డును హరీశ్‌రావు సొంతం చేసుకున్నారు. దుబ్బాక నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తొలిసారి పోటీ చేసిన మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి 97,879 ఓట్లు, బీజేపీ నుంచి పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు 44,366 ఓట్లు వచ్చాయి. కొత్త ప్రభాకర్‌రెడ్డి 53,513 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో దుబ్బాక ప్రజలు అద్భుతమైన తీర్పును ఇచ్చారు. గత ఉప ఎన్నికల్లో బీజేపీ మాటలను నమ్మి ప్రజలు ఓటు వేశారు. తిరిగి ప్రజలు ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టారు. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సునీతాలక్ష్మారెడ్డికి 88,410 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజీరెడ్డికి 79,555 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి 8,855 ఓట్లతో విజయం సాధించారు. పటాన్‌చెరువు నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి 1,05,387 ఓట్లు, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్‌కు 98,296 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి 7,091 ఓట్ల మెజార్టీతో విజయం సొంతం చేసుకున్నారు. ఈయన ఇక్కడి నుంచి వరుసగా మూడు సార్లు పోటీ చేసి హ్యాట్రిక్ కొట్టారు. సంగారెడ్డి నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన చింతా ప్రభాకర్‌కు 82,614 ఓట్లు, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన జగ్గారెడ్డికి 73,317 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ 9,297 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు 97,205 ఓట్లు, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌కు 84,415 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో మాణిక్‌రావు 12,790 ఓట్ల మెజార్టీతో ఘన విజయాన్ని సొంతం చేసుకున్నారు. వరుసగా రెండు సార్లు ఇక్కడి నుంచి గెలుపొందారు. మొత్తంగా పది శాసనసభ స్థానాల్లో ఏడు చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఘన విజయాన్ని సాధించారు. ఆందోల్‌లో దామోదర రాజనర్సింహ 28,193 ఓట్లు, నారాయణ్‌ఖేడ్‌లో పట్లోళ్ల సంజీవరెడ్డి 5,766 ఓట్లు, మెదక్‌లో మైనంపల్లి రోహిత్ 10,157 ఓట్ల మెజార్టీతో మూడు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు.


మహిపాల్ రెడ్డి
పటాన్‌చెరు


కొత్త ప్రభాకర్ రెడ్డి
దుబ్బాక


చింతా ప్రభాకర్
సంగారెడ్డి


మాణిక్ రావు
జహీరాబాద్


మెదక్ చర్చి

# హ్యాట్రిక్ మిస్..!

## మెదక్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఏ పార్టీకి హ్యాట్రిక్ దక్కలే..!

- 34 ఏండ్ల తర్వాత మెతుకు సీమలో కాంగ్రెస్ జెండా
- 1989 తర్వాత 2023లో కాంగ్రెస్ గెలుపు
- 1989లో నారాయణరెడ్డి... 2023లో మైనంపల్లి రోహిత్ విజయం
- 17 సార్లు ఎన్నికలు.. ఏ పార్టీకి హ్యాట్రిక్ రాలేదు

మెదక్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : మెతుకు సీమలో ఇప్పటి వరకు హ్యాట్రిక్ కొట్టిన పార్టీ లేదంటే అవుననే సమాధానం వస్తుంది. ఇప్పటి వరకు ఏ పార్టీ అయినా వరుసగా రెండుసార్లు మాత్రమే గెలిచింది తప్ప మూడోసారి హ్యాట్రిక్ కొట్టలేదు. మెదక్ నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. ఇప్పటి వరకు అసెంబ్లీకి 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఆరుసార్లు (టీడీపీ), ఐదుసార్లు (కాంగ్రెస్) పార్టీ, రెండు సార్లు(బీఆర్‌ఎస్) పార్టీలకు చెంది న వారు ప్రాతినిధ్యం వహించారు. జనతా పార్టీ, సీపీఐ, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కోసారి గెలుపొందారు. 1972లో కరణం రామచంద్రరావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2002లో మంత్రిగా కొనసాగిన కరణం రామచంద్రరావు మరణంతో ఉప ఎన్నికల్లో కరణం భార్య ఉమాదేవి టీడీపీ తరఫున పోటీచేసి గెలుపొందారు. ఆ తర్వాత 2004లో జనతా పార్టీ నుం చి పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో టీడీపీ నుంచి మైనంపల్లి హన్మంతరావు గెలుపొందగా, 2014లో బీఆర్‌ఎస్ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డి విజయం సాధించి శాసనసభ తొలి డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. అనంతరం 2018లో పద్మాదేవేందర్ రెడ్డి రెండోసారి గెలుపొందారు.

### 17 సార్లు ఎన్నికలు.. ఏ పార్టీకి హ్యాట్రిక్ రాలేదు

మెదక్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. 1952లో కాంగ్రెస్ పార్టీ నుంచి వెంకటేశ్వర్‌రావు 15,030 ఓట్లతో గెలుపొందారు. 1957లో కాంగ్రెస్ పార్టీ నుంచి వెంకటేశ్వర్‌రావు 10,564 ఓట్లతో గెలిచారు. 1962లో సీపీఐ నుంచి ఆనందాదేవి 20,874 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1967లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాంచంద్రారెడ్డి 16,251 ఓట్లతో గెలుపొందారు. 1972లో స్వతంత్ర అభ్యర్థి కరణం రామచందర్‌రావు 18,017 ఓట్లతో గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎస్.లక్ష్మారెడ్డి 34,464 ఓట్లతో గెలుపొందారు. 1983లో టీడీపీ నుంచి కరణం రామచంద్రరావు 30,950 ఓట్లతో గెలిచారు. 1985లో టీడీపీ నుంచి కరణం రాంచందర్‌రావు 45,320 ఓట్లతో గెలుపొందారు. 1989లో కాంగ్రెస్ నుంచి నారాయణరెడ్డి 51,990 ఓట్లతో గెలిచారు. 1994లో టీడీపీ నుంచి కరణం రామచంద్రరావు 58,307 ఓట్లతో గెలుపొందారు. 1999లో టీడీపీ నుంచి కరణం రామచంద్రరావు 61,216 ఓట్లతో విజయం సాధించారు. 2002 ఉప ఎన్నికల్లో టీడీపీ నుంచి ఉమాదేవి 43,463 ఓట్లతో విజయం సాదించింది. 2004లో పి.శశిధర్‌రెడ్డి జనతా పార్టీ నుంచి 43,369 ఓట్లతో గెలుపొందారు. 2009లో టీడీపీ నుంచి మైనంపల్లి హన్మంతరావు 57,942 ఓట్లతో గెలుపొందారు. 2014లో బీఆర్‌ఎస్ నుంచి ఎం.పద్మాదేవేందర్ రెడ్డి 89,654 ఓట్లతో విజయం సాధించారు. తిరిగి రెండో సారి 2018లో బీఆర్‌ఎస్ నుంచి ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి 97,670 ఓట్లతో గెలుపొందారు.

### 30 ఏళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ గెలుపు

1989లో మెదక్ అసెంబ్లీకి ఎన్నికలు జరగగా.. కాంగ్రెస్ పార్టీ నుంచి నారాయణరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎవ్వరూ గెలుపొందలేదు. సుమారు 34 ఏండ్ల తర్వాత మళ్లీ 2023లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనంపల్లి రోహిత్ గెలుపొందారు. బీఆర్‌ఎస్ సర్కారు 2014లో ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి 39,600 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా, రెండోసారి 2018లో బీఆర్‌ఎస్ నుంచి ఎం.పద్మాదేవేందర్‌రెడ్డి 47,983 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2023లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించలేదు. దీంతో మెతుకు సీమలో ఏ పార్టీ కూడా హ్యాట్రిక్ విజయం సాధించలేదని చెప్పవచ్చు.



# భూమిని సంరక్షిస్తేనే అధిక దిగుబడి

నేడు ప్రపంచ మృత్తిక దినోత్సవం

- ఆరోగ్యవంతమైన నేలలతోనే జీవవైవిధ్యం
- అశాస్త్రీయ పద్ధతుల్లో సాగుతో భూమి నిస్సారం




మెదక్‌లో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

మెదక్ రూరల్, డిసెంబర్ 4 : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులను పెంచాల్సి ఉన్నది. 1960లో మొదలైన హరిత విప్లవం వల్ల విత్తన నాణ్యత పెరిగి దిగుబడి గణనీయంగా వచ్చింది. కానీ, సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్లో రసాయన ఎరువుల వాడకం, విచ్చలవిడిగా పెరిగిపోయింది. దీంతో భూసారం తగ్గిపోయి లక్షలాది హెక్టార్ల విస్తీర్ణంలో పంట భూములు బీళ్లుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో మనిషి మనుగడకు అవసరమైన భూ ఆరోగ్యాన్ని కర్తవ్యంగా స్వీకరించాలనేది నిపుణుల మాట. నేలల పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి 2013 సంవత్సరం డిసెంబర్ 5న ప్రపంచ మృత్తికా దినోత్సవంగా ప్రకటించింది. మొదటి ప్రపంచ మట్టి దినోత్సవాన్ని 2014 డిసెంబర్ 5 ఘనంగా నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దీనిని జరుపుకొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మట్టిపై అవగాహన పెంపొందించడానికి ఆరోగ్యవంతమైన పర్యావరణ వ్యవస్థ, మానవ సంక్షేమాన్ని నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను పెంపొందించడం కోసం ఈ రోజును నిర్వహించాలి.

### నేడు రైతు వైదికల్లో అవగాహన సదస్సులు

జిల్లాలో ఏఈవోలు క్లస్టర్ పరిధిలో గల రైతు వైదికల్లో రైతులకు నేల సంరక్షణ, నేల సారాన్ని పెంపొందించడానికి పాటించవలిసిన పద్ధతులు, మట్టి నమూనా సేకరణ అవశ్యకత గురించి అవగాహనతో పాటు మట్టినమూనా పరీక్షఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం తీసుకోవాల్సిన పద్ధతుల గురించి రైతులకు అవగాహన కార్యక్రమలు ఉంటాయని వ్యవసాయాధికారులు తెలిపారు.

### అశాస్త్రీయ పద్ధతుల్లో సాగుతో భూమి నిస్సారం

అనంతమైన జీవ వైవిధ్యానికి ఆరోగ్యకరమైన నేలలే పట్టుకొమ్మలు. ఒక ప్రాంతంలో ఉండే జీవ సమూహంలోని వ్యత్యాసాలను జీవ వైవిధ్యంగా పరిగణిస్తారు. నేలల్లో కోట్ల సంఖ్యలో సూక్ష్మజీవులు ఉంటాయి. ఒక అంచనా ప్రకారం చదరపు మీటర్ వైశాల్యంలోని మంచి నేలలో వెయ్యి రకాల సూక్ష్మజీవుల జాతులు ఉండి జీవ వైవిధ్యనికి కారణమవుతున్నాయి. కర్బన సమ్మేళనాలను వినియోగించుకొని పర్యవరణాన్ని కాపాడుతున్నాయి.




### నేలల పరిరక్షణ అందరి బాధ్యత



అధిక దిగుబడులు సాధించాలనే ఏకైక లక్ష్యంతో రైతులు మోతాదుకు మించి రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. మరోవైపు పారిశ్రామిక వ్యర్థాల కారణంగా నేల సారం తగ్గిపోతున్నది. చీడ, పీడల ఉధృతి పెరుగుతున్నది. కనుక ప్రతి ఒక్కరూ నేల పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలి.

-విజయనిర్మల, సహాయ వ్యవసాయసంచాలకులు, మెదక్

### పచ్చిరొట్ట ఎరువులు వాడాలి



పీఏసీఎస్ కార్యాలయంలో పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మన నేలల్లో సేంద్రియ కర్బనం తక్కువగా ఉంది. కనుక సరి చేయడానికి పచ్చిరొట్ట ఎరువులు వాడాలి. దీని వల్లన ఖర్చు తగ్గించమేకాకుండా నేలను పరిరక్షించవచ్చు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు రైతులు వాడాలని సూచించారు. భవిష్యత తరాల మనుగడ కోసం భూమాతను చక్కగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రకృతి ప్రసాదించిన నేలను సంరక్షించుకునేందుకు ముఖ్యంగా రైతులు కార్యోన్ముఖులు కావాలి.

-హన్మంత్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, మెదక్

### నేలల ఆరోగ్యన్ని సంరక్షించేందుకు..

సేంద్రియ ఎరువులు జీవ సంబంధ పురుగుమందులు పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు ఉపయోగించాలి. నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ కొండ ప్రాంతాల్లోని పోడు వ్యవసాయ పద్ధతి నియంత్రించాలి. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేపట్టాలి, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను వాడలి. చీడ, పీడల యాజమాన్యం చేపట్టాలి, విత్తనానికి అవసరమైన చోట మాత్రమే దుక్కి చేయాలి. నేలను కప్పి ఉంచే పద్ధతిని అనుసరించాలి. పంటమార్పిడి, అంతర పంటలు, మిశ్రమ పంటలు, సాగు విధానాల కొనసాగింపుతో నేత కోతను అరికట్టవచ్చు. వ్యవసాయ పంటలు, అటవీ మొక్కలను సంయుక్తంగా ఒకే పొలంలో సాగు చేయడాన్ని వ్యవసాయ అటవీ సంయుక్త పద్ధతిగా చెప్పుకోవచ్చు. దీంతో నివాసాలకు అవసరమైన కలప, పశుగ్రాసం వంటి ఉత్పత్తులు సుస్థిరమైన రీతిలో సమకురుతాయి.